క్లుప్తంగా

'సఖి' శిబిరం ప్రారంభం



విద్యార్థులు తయారు చేసిన న్యూస్ చార్ట్స్

చెన్నూర్: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో వాయిస్ ఫర్ గర్ల్స్, సఖీ శిబిరాన్ని ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ రాజమణి తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల్లో లింగ వివక్షత, నాయకత్వ నైపుణ్యాల పెంపు, సమస్య పరిష్కార సామర్థ్యం, నైతిక విలువలు, ఆర్థిక అసమానతల తొలగింపు లాంటి అంశాల పై అవగాహన కల్పించారు. శిబిరం ఈ నెల 30వరకు సాగుతుందన్నారు. అదిలాబాద్ రీజియన్ నుంచి తొమ్మిది సాంఘిక సంక్షేమ పాఠశాలలు, కళాశాలల నుంచి 187మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఈ కమ్యూనికేషన్ స్కిల్స్‌పై నిర్వహించే అవగాహన కార్యక్రమాన్ని విద్యార్థులు సద్విని యోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలకు స్పందన

దండేపల్లి: మండలంలోని మొకాసిగూడెంలో మంచిర్యాల చార్వాక, డంబ్ అండ్ డెఫ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. సమీప గ్రామాల ప్రజలు వచ్చి వైద్యపరీక్షలు చేయించుకున్నారు. అవసరం ఉన్నవారికి ఉచితంగా మందులు అందించారు. వైద్యులు నీలకంటేశ్వర్‌రావు, తేజశ్వి, చంద్రమౌళి, శ్రీనివాస్, సిబ్బంది రఘు, దీప, ప్రత్యూష, మణిదీప్ పాల్గొన్నారు. మేదరిపేట ప్రగతి పాఠశాల ఆవరణలో మంచిర్యాల ఎయిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరం ఉన్నవారికి ఉచితంగా మందులు అందజేశారు. వైద్యులు యెగ్గన శ్రీనివా స్, సునీత, అతివేణి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ వ్యతిరేక దినం

మంచిర్యాలటౌన్: ఇందిరాగాంధీ ప్రభుత్వంలో విధించిన ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడి జైలుకు వెళ్లిన మంచిర్యాల పట్టణానికి చెందిన దామెర రాజయ్య, ఆనంద్‌రావులను ఆదివారం బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాడు ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ఉద్యమం చేస్తున్న వారిని, నాటి ప్రభుత్వం అణిచివేతకు గురి చేయడంపై వివరిస్తూ, చీకటి రోజులుగా అభివర్ణించారు. కార్యక్రమంలో పెద్దపల్లి పురుషోత్తం, రజనీశ్ జైన్, తోట మల్లికార్జున్, బోయిని హరికృష్ణ, నాగుల రాజన్న, బొద్దున మల్లేశ్, బోయిని దేవేందర్, శ్రీనివాస్, రాకేశ్ రెన్వా పాల్గొన్నారు.

'దళితబంధు యూనిట్లు మాలలకు కేటాయించాలి'

బెల్లంపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దళితబంధు పథకంలో మాలలకు 50శాతం యూనిట్లు కేటాయించాలని తెలంగాణ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కుంబాల రాజేశ్ అన్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మాలమహానాడు పట్టణ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని విధాలుగా వెనుకబడిన మాలలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్ రుణాలు పునఃప్రారంభించాలన్నారు. అనంతరం మాల మహానాడు పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు.

కాంగ్రెస్‌ను ఆదరించాలి



జెండా ఆవిష్కరిస్తున్న గడ్డం వినోద్

తాండూర్: ప్రజల ఆకాంక్షను గుర్తించి, తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని రానున్న ఎన్నికల్లో ఆదరించి సోనియమ్మకు కానుకగా అందించాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు గడ్డం వినోద్ అన్నారు. తాండూర్ మండలంలో ఆదివారం ఆయన పర్యటించారు. కిష్టంపేటలో ర్యాలీ చేపట్టారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీతోనే మెరుగైన పాలన సాధ్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సూరిబాబు, రాంచందర్, మల్లయ్య, శ్రీనివాస్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

మందమర్రిరూరల్: పట్టణంలోని కేకే–5 ఫిల్టర్‌బెడ్ ఏరియాకు చెందిన పలువురు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి టీపీసీసీ మెంబర్ నూకల రమేష్, పీసీసీ జనరల్ సెక్రెటరీ రఘునాథరెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వెంకటేష్, సిద్దార్థ్, సుదాకర్, రంజిత్, పెద్దిరాజు, పోషాలు, రాజు, తిరుపతి, చందర్, చంద్రకాంత్ తదితరులున్నారు.

ఆషాఢమాసం.. అమ్మకు బోనం

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం బోనం. ఆషాఢ మాసం వచ్చిందంటే బోనాల జాతర మొదలవుతోంది. ఆషాఢమాసంలో దేవి (అమ్మవారు) తన పుట్టింటికి వెళ్తుందని నమ్మకం.. అందుకే ఈ పండుగ సమయంలో అమ్మవారిని దర్శించుకుంటే తమ సొంత కూతురు తమ ఇంటికి వచ్చిందనే భావనతో భక్తిశ్రద్ధలతో బోనాలను ఆహార నైవేద్యంగా సమర్పిస్తారు. స్థానికుల కట్టుబొట్టు ఆకట్టుకుంటుంది. వారి ఐక్యతను చాటుతోంది. డప్పుసప్పుళ్లు, శివసత్తులు, పోతరాజుల నృత్యాల నడుమ భక్తులు, మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకుని ఆలయాలకు ఊరేగింపుగా తరలివెళ్లటం ఆనవాయితీ. ఒక్కో ప్రాంతంలో వారి కులదైవమైన మైసమ్మ, పోచమ్మ, భూలక్ష్మి, ఎల్లమ్మ, పెద్దమ్మ, మారెమ్మ, పోలేరమ్మ, మహంకాళమ్మ ఇలా అనేక పేర్లుంటాయి. ఎన్నో విశిష్టతలు.. మరెన్నో ప్రత్యేకతలు కలిగిన బోనాల పండుగ ఆషాఢ మాసంలో సామూహికంగా నిర్వహిస్తుంటారు. గ్రామదేవతల ఆలయాలు భక్తులతో సందడిగా మారుతాయి. ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం ఊరూరా బోనాల జాతర మొదలయ్యింది.

ఎల్లారం పోచమ్మకు మొక్కులు

ఆధ్యాత్మికం



భీమిని: కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ పరిధిలోని ఎల్లారం పోచమ్మ ఆలయానికి భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు ముందుగా స్థానిక గుండాల్లో పుణ్యస్నానం ఆచరించి, అక్కడ ఉన్న గంగ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నైవేద్యం వండి అమ్మవారికి సమర్పించారు. బెల్లం, కల్లు శాఖలతో కోళ్లు, మేకలు బలిచ్చి మమ్మల్ని సల్లంగా చూడాలి తల్లి అంటూ వేడుకున్నారు. అనంతరం ఆలయ పరిసరాల్లోని చెట్ల కింద సహపంక్తి భోజనాలు చేశారు.

పట్నం వేసి.. పెద్దమ్మను కొలిచి



పట్నం వేసి పెద్దమ్మను కొలుస్తున్న పూజారులు

దండేపల్లి: మండలంలోని నెల్కివెంకటాపూర్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పెద్దమ్మతల్లి పట్నాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. బైండ్ల పూజారులు పెద్దమ్మ ఆలయం ముందు పసుపు, పిండితో పట్టుపరిచి పెద్దమ్మను కొలిచారు. ముదిరాజ్ కులస్తులు కుటుంబ సమేతంగా వచ్చి పెద్దమ్మతల్లి పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకల్లో ముదిరాజ్ సంఘం జిల్లా, మండల, గ్రామ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు

రామకృష్ణాపూర్: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో గల మహంకాళి అమ్మవారి ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి మొక్కులు సమర్పించారు. వచ్చే మరో మూడు ఆదివారాలు కూడా అమ్మవారికి బోనాలు సమర్పించటం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



మొక్కులు చెల్లించేందుకు వస్తున్న భక్తులు

పోటెత్తిన భక్తులు



జన్నారం: మండలంలోని చింతగూడ శ్రీ లక్ష్మీదేవి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. వర్షం కురువడంతో జన్నారం మండలంతో పాటు పరిసర జిల్లాలు, మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి ఆలయానికి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. బోనాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం అమ్మవారి నామస్మరణతో మారుమోగింది. ఆలయ కమిటీ భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

పెద్దమ్మ తల్లి బోనాలు



చెన్నూర్: పట్టణంలోని ఎమ్మెల్యే కాలనీ(ఎనగుట్ట) లో గల పెద్దమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి బోనాల జాతర వైభవంగా జరిగింది. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, ముధిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.

భక్తజన సందోహం.. మదనం పోచమ్మ ఆలయం



చెన్నూర్: స్థానిక మదనం పోచమ్మ ఆలయంలో భక్తజనం పోటెత్తింది. ఆషాఢ మాసం తొలి ఆదివారం కావడంతో తెల్లవారు జాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. భక్తుల తాకిడి పెరగడంతో ఆలయ ఆవరణలో రోడ్డు పైనే వందలాది మంది భక్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఆలయ ప్రాంగణంలో భక్తులకు సౌకర్యాలు లేకపోవడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. వివిధ పట్టణాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్మించిన షెడ్లు సరిపోకపోవడంతో భక్తులు చెట్ల పొదలు, రోడ్లకు ఇరువైపుల ఎండలోనే వంటలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కోటపల్లి మండలానికి వెళ్లే రోడ్డు పక్కనే ఆలయం ఉండడంతో అటుగా వెళ్లే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న సీఐ వాసుదేవరావు సంఘటనా స్థలానికి పోలీసు సిబ్బందిని పంపించి, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.



చెట్ల మధ్య వంటలు చేసుకుంటున్న భక్తులు

ఇందూరి పోచమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ



మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామంలో ఆదివారం ఇందూరి పోచమ్మతల్లి విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. 2016లో ఇందూరి పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ గ్రామస్తుల భక్తిశ్రద్ధల మధ్య జరిగింది. గతేడాది భారీ వరదలతో ఆలయం కొంత మేర మరమ్మత్తులకు గురైంది. దీంతో ఆలయ మరమ్మత్తులు నిర్వహించి ఇందూరి పోచమ్మతల్లి విగ్రహాన్ని వేదమంత్రోఛ్చారణల మధ్య ఘనంగా ప్రతిష్ఠించారు. ఈ మేరకు ఉదయం గ్రామంలోని ప్రతీ ఇంటి నుంచి పోచమ్మ తల్లి బోనాలను నెత్తిన పెట్టుకుని మేక, కోళ్లతో ఆలయానికి పోతరాజులు, శివసత్తుల పూనకాల మధ్య భారీ శోభాయాత్రగా బయలుదేరి పోచమ్మతల్లికి మొక్కులు సమర్పించుకున్నారు.



తాగునీటి సమస్య పరిష్కరిస్తా

- మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్ రావు

శ్రీరాంపూర్: తాను ఎమ్మెల్యేగా గెలిస్తే ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తానని, ఇక ట్యాంకర్ల ద్వారా వేసవిలో నీళ్లు అందించే అవసరం ఉండదని మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యుడు ప్రేంసాగర్‌రావు తెలిపారు. 64రోజులుగా కొక్కిరాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. వర్షాకాలం మొదలు కావడంతో ఆదివారం ఈ కార్యక్రమానికి ముగింపు పలికారు. ఈ సందర్భంగా సీసీసీ కార్నర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలో నిత్యం 12ట్రాక్టర్లతో నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు నిండు వేసవిలో తాగునీటిని అందించామన్నారు. గోదావరిలో ప్రత్యేకంగా బోర్లు వేసి, ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా ట్యాంకర్లు పెట్టి నీటి సరఫరా చేసామన్నారు. ఇవన్నీ తన సొంత ఖర్చుతో చేశానని తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే ట్యాంకర్లతో పని లేకుండా, ప్రతి ఇంటికి గోదావరి నీటిని నల్లాల ద్వారా అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ నస్పూర్ పట్టణ అధ్యక్షుడు బండారి సుధాకర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుర్మిళ్ల వేణు, నాయకులు శ్రీపతి మల్లేష్, భూపతి శీను, సంపత్ రెడ్డి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



ట్యాంకర్ ద్వారా నీళ్లు పోస్తున్న ప్రేమ్ సాగర్‌రావు

కొత్తపల్లి దళిత రైతులకు పట్టాలివ్వాలి

భీమిని: కన్నెపల్లి మండలంలోని కొత్తపల్లి గ్రామ దళిత రైతులకు పట్టాలివ్వాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మండల అధ్యక్షుడు బేర రామన్న యాదవ్ అన్నారు. కన్నెపల్లి మండలంలోని రెబ్బెన, కొత్తపల్లి గ్రామాల్లో మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం బీజేపీ ప్రభుత్వం అమలు పరుస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని వేడుకున్నారు. కరపత్రాలు పంపిణీ చేశారు. కొత్తపల్లి గ్రామంలో గిరిజనులు చేసుకుంటున్న భూములకు ప్రభుత్వం వెంటనే పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామన్నయాదవ్, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, నాయకులు, గోమాస అంజి, ప్రకాష్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'వలసవాదులకు టికెట్ ఇస్తే పార్టీకి నష్టం'

తాండూర్: ఎన్నికల సమయంలో డబ్బుల పెట్టెలతో వచ్చే వలసవాదులకు బెల్లంపల్లి ఎమ్మెల్యే టికెట్ కేటాయిస్తే కాంగ్రెస్ పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని పలువురు కాంగ్రెస్ నేతలు అన్నారు. మండలంలోని సురభి గార్డెన్స్‌లో ఆదివారం నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి సూరం రవీందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రొడ్డ శారద, టీపీసీసీ నాయకులు తొంగల మల్లేష్, బండి ప్రభాకర్, నాతరి స్వామి మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా పార్టీ అభ్యున్నతికి, పార్టీ బలోపేతానికి కృషి చేసిన నాయకులను అధిష్టానం గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. అలా కాకుండా డబ్బున్న వారికి, స్థానికంగా లేని స్థానికేతర్లకు టికెట్ కేటాయిస్తే ప్రజలు ఆదరించే పరిస్థితులు లేవని, దాని వల్ల గెలిచే స్థానానికి నష్టం వాటిల్లుతుందన్నారు. ఈ సారి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని తెలుసుకుని ఎన్నో పార్టీలు మారిన నేతలు పార్టీ టికెట్ ఆశిస్తున్నారని, అలాంటి వారిని కాకుండా పార్టీని నమ్ముకుని ఉన్న స్థానికులకే టికెట్ కేటాయించాలన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు సూరం దామోదర్‌రెడ్డి, నాయకులు కాపర్తి సుభాష్, పుట్ట శ్రీనివాస్, లక్ష్మణ్, ప్రభాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

వాసవీక్లబ్ సేవా కార్యక్రమాలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల వాసవీ క్లబ్ రీజియన్ స్థాయిలో డాన్ టు డస్క్ ప్రత్యేక కార్యక్రమం ద్వారా ఉదయాస్తమాన సేవా కార్యక్రమాలను ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా అంతర్జాతీయ వాసవి క్లబ్ జాయింట్ సెక్రటరీ అలిమిల్ల మనోజ్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఇల్లందుల కిశోర్ హాజరై మాట్లాడారు. నిరుపేద వైశ్య కుటుంబాలకు ఒక నెలకు సరిపడా నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. రైతులకు వ్యవసాయానికి అవసరమైన స్ప్రే యంత్రాలు, జవాన్‌కు సత్కారం, రెడ్‌క్రాస్ సొసైటీ వృద్ధాశ్రమంలోని వారికి చీరలు, దోతులను అందించారు. శ్రీనివాస్, హరీష్, వెంకటేశ్వర్లు, సతీశ్, వంశీకృష్ణ, ప్రవీణ్, వెంకటేశ్, మహేశ్, సాయివర్ధన్, వనిత, లావణ్య, స్వప్న పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: పట్టణంలోని మార్కెట్ ఏరియాలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ క్యాలండర్ ఈవెంట్స్ ప్రోగ్రాం ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. వాసవీ క్లబ్ పట్టణ అధ్యక్షురాలు మంజుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాసవి క్లబ్ గవర్నర్ చంద్రశేఖర్ హాజరయ్యారు. మండలంలోని సారంగపల్లి గ్రామ పంచాయితీలోని తుర్కపల్లికి చెందిన ఆవుల రమేష్ అనే రైతును శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. 20మంది మహిళలకు చీరలను పంపిణీ చేసి, 5కుటుంబాలకు నిత్యావసర వస్తువులు అందించారు. కార్యక్రమంలో మందమర్రి వ్యాపార కమిటీ అధ్యక్షుడు తమ్మిశెట్టి విజయ్‌కుమార్, వాసవి క్లబ్ కుటుంబ సభ్యులు విద్యాసాగర్, రవీందర్, ధనలక్ష్మి, మధుశ్రీ, రమ్య, మాలతి, కవిత, శ్రీదేవి, సరిత, సరోజ సావిత్రి, పద్మ తదితరులు ఉన్నారు.



వృద్ధులకు చీరలు అందిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

అటెన్షన్ ప్లీజ్..

ట్రాన్స్‌ఫార్మర్ నిరుపయోగం

భీమారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ కలప డిపోకి విద్యుత్తు సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ ఇవ్వకపోవడంతో అది నిరుపయోగంగా ఉంది. అసలే దొంగల బెడద ఉన్న ఈ పరిస్థితుల్లో, వెంటనే కనెక్షన్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సంబంధిత అధికారి : శ్రీనివాస్,
విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ, భీమారం
ఫోన్ నంబర్ : 89194 66411



సంక్షిప్త వార్తలు

నియామకం

మంచిర్యాలటౌన్: పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు గట్టు శ్రీనివాస్‌ను హ్యూమన్ రైట్ కౌన్సిల్ ఇండియా తెలంగాణ రాష్ట్ర మీడియా కార్యదర్శిగా నియమిస్తూ, జాతీయ చైర్మన్ చెన్నుపాటి శ్రీకాంత్ ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆదివారం నియామకపత్రాన్ని శ్రీనివాస్‌కు అందించారు.

నవోదయ, సైనిక్ స్కూల్‌కు ఎంపిక

వేమనపల్లి: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కుమ్రం నవనీత్ వరంగల్ అశోక్ నగర్‌లోని సైనిక్ పాఠశాలతో పాటు కాగజ్ నగర్‌లోని నవోదయ పాఠశాలకు ఎంపికయ్యాడు. ఇప్పటికే సైనిక్ పాఠశాల నిర్వహించిన శారీరక, మానసిక , వ్యక్తిత్వ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాడు. విద్యార్థిని ఆదివారం పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లిదండ్రులు అభినందించారు.

రామాలయ కమిటీ ఎన్నిక

దండేపల్లి: మండల రామాలయ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గుర్రం సత్తయ్య, అధ్యక్షుడిగా గుర్రం గంగన్న, ఉపాధ్యక్షులుగా బొలిశెట్టి రాజన్న, కుంచె కిషన్, అల్లం కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా మల్లూరి వినోద్, కోశాధికారిగా మల్లూరి లక్ష్మీనారాయణ, ప్రచార కార్యదర్శిగా బుర్ర శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా కట్కూరి రాజన్న, సలహాదారులుగా గొట్ల భూమన్న, ముత్యాల శ్రీనివాస్, పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

చెన్నూర్‌రూరల్: మండలంలోని అక్కెపల్లి, కిష్టంపేట, ఎల్లక్కపేట గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఆదివారం చెన్నూర్ పట్టణ సీఐ వాసుదేవరావు పరిశీలించారు. రాబోయే ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై ఆరా తీశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ పెద్దింటి రాజన్న, హెచ్ఎం సత్యనారాయణ, కార్యదర్శి సతీశ్ ఉన్నారు.

వర్షానికి కూలిన ఇంటి గోడ

నెన్నెల: మండలంలోని గంగారం గ్రామానికి చెందిన దెబ్బ అశోక్ కు చెందిన రేకుల ఇంటి గోడ శనివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి కూలిపోయింది. ఆ సమయంలో అటు వైపు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అశోక్ ఇల్లు, గతంలో కూడా కూలిపోవడంతో సిమెంట్, రేకులతో ఇల్లు నిర్మించుకున్నాడు. ఆ ఇల్లు సైతం కూలిపోవడంతో నిరాశ్రయులమయ్యామని, అధికారులు స్పందించి పరిహారం అందించి ఆదుకోవాలని వేడుకున్నారు.

మాజీ ప్రధాని వీపీ సింగ్ జయంతి

పాతమంచిర్యాల: మాజీ ప్రధానమంత్రి వీపీ సింగ్ జయంతిని జిల్లా కేంద్రంలో తెలంగాణ బీసీ జాగృతి, బీసీ ఐక్యవేదిక నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.